

శరవేగంగా అభివృద్ధి

నియోజకవర్గ అభివృద్ధికి సీఎం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని కాంగ్రెస్ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తెలిపారు. 8లో ▸



పేరుగొప్ప.. ఊరుదిబ్బ

పేరుకే ప్రజాప్రతినిధులం. నిధులు లేవు. సమాజంలో గౌరవం లేదని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



సర్కారు బడుల్లోనే..

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందుతోందని విశ్వనాథ్‌పూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి అన్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

నేడు ధ్రువపత్రాల పరిశీలన

అనంతగిరి: జిల్లాలోని భాషా పండితులు గ్రేడ్ -2 (ఎల్‌పీ - తెలుగు, ఎల్‌పీ - హిందీ, ఎల్‌పీ - ఉర్దూ), పీఈటీలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు డీఈఓ రేణుకాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు డీఈఓ కార్యాలయంలో ఈ ప్రక్రియ ఉంటుందన్నారు. కావున సంబంధిత ఉపాధ్యాయులు ఒరిజనల్ సర్వీసు రిజిస్టర్, ఒరిజనల్ సర్టిఫికెట్లు, ర్యాంకు కార్డు, అపాయింట్‌మెంట్ ఆర్డర్ రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. అలాగే సంబంధిత ఫార్మట్ కూడా తీసుకరావాలని సూచించారు.

'బైక్ రేసింగ్' ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ ఆంజనేయులు తదితరులు

మోమిన్‌పేట: మండలంలోని మల్లారెడ్డిగూడెం సమీపంలో ఆదివారం జాతీయ బైక్ చాంపియన్ షిప్ రేసింగ్ నిర్వహిస్తారని సీఐ ఆంజనేయులు తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల నుంచి ఈ పోటీలో పాల్గొనేందుకు క్రీడాకారులు వచ్చారని తెలిపారు. ఆదివారం ఉదయం పోటీలు ప్రారంభవుతాయని పేర్కొన్నారు. సుమారు 67మంది క్రీడాకారులు వచ్చినట్లు తెలిపారు. ప్రతి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు రాజశేఖర్, ఎస్ఐ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ చట్టాలపై అవగాహన కల్పించాలి

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



కుల్కచర్ల: అటవీ శాఖ చట్టాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం చౌడాపూర్ మండలం పాచాక్‌కుంట తండాకు చెందిన వృద్ధులు అవగాహన లేక నెమలిని తిన్నారని తెలిపారు. చదువు లేకపోవడం, అటవీ చట్టాలపై అవగాహన లేక అలా చేశారని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అవగాహన కల్పించాలని కోరారు. నెమలిని తిన్న వృద్ధులకు మానవతా దృక్పథంతో బెయిల్ మంజూరు చేసిన న్యాయమూర్తి శిల్పకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రాజీమార్గమే రాజమార్గం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: రాజీపడితే ఇరువర్గాలు విజయం సాధించినట్లేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 2,652 కేసులు రాజీపడగా, ఇందులో వికారాబాద్ కోర్టులో 636 కేసులు, పరిగిలో 461, తాండూరులో 1,216 కేసులు రాజీ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరువర్గాలు విశాల దృక్పథంతో ఆలోచిస్తే కేసుల నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. ప్రతి వ్యక్తీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, అదనపు న్యాయమూర్తి శృతిదూత, ఎస్పీ కోటిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేష్, పీపీ రాజేశ్వర్, అన్వేష్‌సింగ్, సమీనాబేగం పాల్గొన్నారు.

రేపటి నుంచి 'ప్రజావాణి'

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ శశాంక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడంతో ప్రజావాణిని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగిసినందున కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



పరిగి పట్టణంలో చేపలు కొనుగోలు చేస్తున్న జనం



అనంతగిరి: వికారాబాద్‌లో చేపల విక్రయం

మృగశిర వచ్చె.. మీనం మెరిసె

మృగశిర కార్తె ప్రారంభం కావడంతో మొదటి రోజు శనివారం చేపలకు డిమాండ్ పెరిగింది. కార్తె ప్రారంభం రోజు చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుంచే జనం చేపల కోసం బారులుతీరారు. దీంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. సాధారణ రోజుల్లో కిలో బొచ్చ, రవ్వ రూ.150 నుంచి రూ.180 వరకు ఉండేది. కార్తె సందర్భంగా రూ.220 వరకు పెంచేశారు. కిలో కొరమీను రూ.350 నుంచి రూ.500కు పెంచారు.

నేడే గ్రూప్ -1



గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారి

వికారాబాద్: గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం నిర్వహించే పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కోటిరెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. వికారాబాద్‌లో ఏడు, తాండూరులో నాలుగు, పరిగిలో రెండు ఏర్పాటు చేశారు. 5,468 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష నిర్వహణకు నోడల్ అధికారులను నియమించారు.

ఏర్పాట్లు పూర్తి

పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. కేంద్రాల్లో పారిశుద్ధ్యం, సీసీ కెమెరాల ఏర్పాటు, వాష్ రూమ్‌లు, బెంచీలు, టేబుల్స్, ఫ్యాన్లు, మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, విద్యుత్, మంచినీటి వసతి కల్పించారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. అభ్యర్థుల హాజరు కోసం బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో అందుకు అవసరమైన పరికరాలను సమకూరుస్తున్నారు. ప్రతి సెంటర్ వద్ద పోలీసు బందోబస్తు, వైద్య సిబ్బంది, టెక్నికల్ సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టారు. వికారాబాద్ రైల్వేస్టేషన్, బస్టాండ్, ఎన్టీఆర్ చౌరస్తా నుంచి పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సులు నడపనున్నారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..

వికారాబాద్‌లోని గౌతమి జూనియర్ కళాశాల (గరీబ్ నగర్), శ్రీ కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్(పరిగి), సింధూ జూనియర్ కళాశాల(తాండూరు బస్టాండ్ పక్కన), విశ్వభారతి డిగ్రీ కళాశాల(వికారాబాద్, గంగారం, బస్టాండు పక్కన), సిద్ధార్థ జూనియర్ కళాశాల(ఆదర్శ నగర్ బస్టాండు పక్కన, తాండూరు), సిద్ధార్థ జూనియర్ కళాశాల(కన్యలాల్‌బాద్, బస్టాండు పక్కన, వికారాబాద్), ప్రభుత్వ డిగ్రీ కళాశాల(రాజీవ్ కాలనీ తాండూరు), టీఎస్ డబ్ల్యూఆర్(బాలికల గురుకుల పాఠశాల కొత్తగడి, వికారాబాద్), పల్లవీ డిగ్రీ కళాశాల(షాద్‌నగర్ రోడ్డు, పరిగి), ఎస్ఏపీ కళాశాల(అనంతగిరి రోడ్డు, వికారాబాద్), బ్యాంగి ఇంటర్ నేషనల్ స్కూల్(పరిగి రోడ్డు, వికారాబాద్), సింధూ డిగ్రీ కళాశాల(కొడంగల్ రోడ్డు, తాండూరు), శ్రీ సాయి డెంటల్ కళాశాల(శివారెడ్డిపేట, హైదరాబాద్ రోడ్డు, వికారాబాద్)లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నిబంధనలు

- గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షను 9వ తేదీ ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నారు.
- ఉదయం 9గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 13 కేంద్రాలు
- హాజరు కానున్న 5,468 మంది అభ్యర్థులు
- ఉదయం 9గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతి
- 10గంటలు దాటితే నో ఎంట్రీ

- 10 గంటల తరువాత ఎట్టి పరిస్థితిలో అనుమతించరు.
- కేంద్రాల్లో సీసీ కెమెరాల తోపాటు పరీక్ష ఆరంభం నుంచి పూర్తయ్యే వరకు వీడియో రికార్డు చేస్తారు.
- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు షూ ధరించరాదు.
- హాల్ టికెట్ తోపాటు బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్‌లు తెచ్చుకోవచ్చు. అలాగే ప్రభుత్వ గుర్తింపు కార్డులు (ఓటరు, పాన్, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్టు కార్డు)ల్లో ఏదైనా ఒకటి తీసుకెళ్లాలి.
- హాల్ టికెట్‌పై ఫొటో సరిగ్గా కనిపించని వారు గెజిటెడ్ ఆఫీసర్ సంతకంతో పాటు మూడు లేటెస్ట్ పాస్ ఫొటోలు తీసుకురావాలి.
- కేంద్రాల్లోకి రైటింగ్ ప్యాడ్స్, క్యాలుక్లేటర్, మొబైల్ ఫోన్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. ఓఎంఆర్ షీట్‌పై వైట్‌నర్, చాక్ పౌడర్, ఎరేజర్, బ్లేడ్ లాంటివి వినియోగించడం చెల్లదు.
- పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులెవరూ బయటకు వెళ్లేందుకు అనుమతించరు.

కట్టుదిట్టమైన బందోబస్తు



అనంతగిరి: గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. వికారాబాద్, తాండూరు, పరిగిలోని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రాల వద్ద జనం గుమికూడరాదన్నారు. అభ్యర్థులకు ట్రాఫిక్, ఇతర ఏదైనా ఇబ్బంది ఉంటే డయల్ 100కు కాల్ చేసి పోలీసు అధికారుల సహాయం తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

హస్తంలో అంతర్మథనం

- జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బ
- లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై పోస్టుమార్టం
- అంచనాలు తలకిందులు కావడంపై విశ్లేషణ
- బూత్‌ల వారీగా ఓట్ల లెక్కలు చేస్తున్న నాయకులు



పరిగి: అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాను క్లీన్ స్వీప్ కాంగ్రెస్ పార్టీ.. లోక్‌సభ ఎన్నికల్లో చతికల పడటంతో నాయకులు అంతర్మథనంలో పడ్డారు. గెలుపు అంచనాలు తలకిందులు కావడానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు ముందుకు సాగారు. విజయం మాత్రం కమలం పార్టీని వరించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో హస్తం పార్టీ హవా చాటింది. వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉండగా బీజేపీ ఎక్కడా ప్రభావం చూపలేకపోయింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా పుంజుకుంది. ఆ పార్టీ చేవెళ్ల, పాలమూరు అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించారు.

అధికార పార్టీకి గట్టి దెబ్బ

లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో అధికార పార్టీకి గట్టి దెబ్బే తగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించడం, సీఎం జిల్లా కావడంతో చేవెళ్ల, పాలమూరు ఎంపీ సీట్లపై రాష్ట్ర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాలు అధికార కాంగ్రెస్‌కు ఆధిక్యం రాగా, పరిగి, తాండూరు నియోజకవర్గాలు బీజేపీ సత్తా చాటింది. రెండు పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలడంతో కాంగ్రెస్‌కు ఊహించని షాక్ తగిలింది. గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెండో స్థానంలో ఉండగా బీజేపీకి డిపాజిట్లు కూడా రాలేదు. కానీ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కమలం పార్టీకి గతంలో వచ్చిన ఓట్ల కన్నా మూడు నుంచి నాలుగింతలు ఎక్కువ రావడం కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఓటర్ల ఇంతగా బీజేపీ వైపు మొగ్గు చూపడానికి కారణం ఏమిటనే ఆలోచనలో పడ్డారు. అసలు ఏం జరిగిందనే దానిపై క్షేత్రస్థాయిలో సమాచారం సేకరిస్తున్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేశారా, లేకపోతే బీజేపీకి కోవర్టులుగా మారారా అన్న సమాచారం తీసుకుంటున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు తీస్తున్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న గ్రామాల్లో బీజేపీ గాలి వీయడానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

సీరియస్‌గా తీసుకోని ద్వితీయ శ్రేణి నాయకులు

అసెంబ్లీ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేశారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించింది. అయితే లోక్‌సభ ఎన్నికలను మాత్రం అంత సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ఎన్నికల కోడ్ వచ్చింది మొదలు ద్వితీయ శ్రేణి నాయకులు పెద్దగా ప్రచారం చేసింది లేదు. ఈ కారణంగానే పెద్ద దెబ్బ పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పరిగి నియోజకవర్గంలో కొంతమంది నాయకులు పార్టీ అధికారంలో ఉందనే అహంతో ఇష్టానుసారంగా వ్యవహరించడం ద్వారా ద్వితీయ శ్రేణి నాయకులు క్రాస్ ఓటింగ్ చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. గెలుపు అంచనాలను తలకిందులు కావడంతో నాయకులు అధిష్టానానికి ఏం చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సీఎం జిల్లాలోనే బీజేపీ ఎంపీ అభ్యర్థులు గెలవడంపై నాయకులు అయోమయంలో పడ్డారు.

చంపేస్తాడని.. చంపేశాడు

- పాత కక్షల నేపథ్యంలో బావమరిదిని హత్య చేసిన బావ
- మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన
- మృతుడు, హతుడు ఇద్దరూ పాత నేరస్తులే..



హత్యకు గురైన సల్మాన్ (ఫైల్)

మీర్‌పేట: పాత కక్షల నేపథ్యంలో పథకం ప్రకారం బావమరిదిని హత్య చేసిన ఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. నందనవనానికి చెందిన షభానాబేగం కుమారుడు సల్మాన్ (25) పలు కేసుల్లో నిందితుడు. దీంతో పోలీసులు అతనిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు. ఇదే ప్రాంతానికి చెందిన పాత నేరస్తుడు దాసరి సురేందర్ (32).. సల్మాన్ చెల్లి ఫాతిమాబేగంను 2021లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏడాది తర్వాత ఆమెను భవనం పైనుంచి తోసి చంపేశాడు. దీంతో సురేందర్‌ను అరెస్టు చేసిన పోలీసులు అతన్ని జైలుకు పంపారు. ఈ నేపథ్యంలో సల్మాన్, సురేందర్ మధ్య వైరం పెరిగింది. ఇద్దరూ జైలులో ఉండగా సైతం తరచూ గొడవ పడేవారు. రెండు నెలల క్రితం (పది రోజుల తేడాలో) ఇద్దరూ జైలు నుంచి బయటకు వచ్చారు. ఇదిలా ఉండగా సల్మాన్ పెద్దనాన్న కూతురు స్వర్ణలతతో సురేందర్ సన్నిహితంగా ఉంటున్నాడు. అప్పటికే తన చెల్లిని చంపాడని రగిలిపోతున్న సల్మాన్ బతికిఉంటే తనకు ప్రమాదమని భావించిన సురేందర్ బావమరిదిని చంపేయాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం శుక్రవారం రాత్రి 11 గంటల తర్వాత స్వర్ణలత ద్వారా సల్మాన్‌కు ఫోన్ చేయించి టీకేఆర్ కమాన్ సమీపంలోని నిర్జన ప్రదేశంలోకి రప్పించాడు. వచ్చీ రాగానే సురేందర్ అతనిపై కత్తితో విరుచుకుపడ్డాడు. గొంతుతో పాటు శరీరంపై దాడి చేయడంతో సల్మాన్ అక్కడికక్కడే కూలిపోయాడు. విషయం తెలుసుకున్న సల్మాన్ తమ్ముడు అర్బాజ్ వెంటనే అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి షభానాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు సురేందర్‌తో పాటు అతని అనుచరులు పరారీలో ఉన్నట్లు సీఐ వివరించారు. సల్మాన్ తల్లి ముస్లిం కాగా తండ్రి హిందువు అని పోలీసులు తెలిపారు.

పదోన్నతుల్లో అవకాశం కల్పించండి

కడ్తాల్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి ప్రారంభమైన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ ప్రక్రియలో జిల్లాను మినహాయించడం తగదని.. అన్ని జిల్లాలతో పాటే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని వివిధ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుతం జరుగుతున్న టీచర్ల బదిలీల, పదోన్నతుల షెడ్యూల్‌లో జిల్లాను మినహాయించడం ద్వారా భవిష్యత్‌లో తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

కిలో వద్దు.. పావుకిలో హద్దు

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అవసరాలకు సరిపడా సరఫరా లేకపోవడంతో అమాంతం ధరలు పెరిగిపోయాయి. బీన్స్ బీరాలు పోతోంది. చిక్కుడు చిక్కనంటోంది. పచ్చిమర్చి ఘాటెక్కిపోయింది. టమాటా పైపైకి ఎగబాకుతోంది. ఏది కొనాలన్నా కిలో రూ.80 నుంచి రూ.100 పైనే పలుకుతున్నాయి. దీంతో కిలో కొనాలనుకున్న వారు పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు.

- భగ్గుమంటున్న కూరగాయల ధరలు
- బీన్స్ కిలో రూ.150
- రూ.120కి చేరిన పచ్చిమిర్చి, చిక్కుడు
- అదే దారిలో మిగతా రకాలు
- బెంబేలెత్తిపోతున్న సామాన్యులు



షాబాద్: వర్షాకాలం ఆరంభం కానున్న సమయంలో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. సాధారణంగా ఏటా ఆషాఢం, శ్రావణ మాసాల్లో ధరలు పెరిగి సామాన్యులను కుదేలు చేస్తుంటాయి. గత ఏడాది సరైన వర్షాలు పడకపోవటం, ఎండలు తీవ్రంగా ఉండటంతో ఈసారి స్థానికంగా కూరగాయల సాగు, దిగుబడి తగ్గింది. ఈ కారణంగా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ధరలు ఒక్కసారిగా పెరుగుతున్నాయి. పదిరోజుల క్రితం వరకు కిలో పచ్చిమిర్చి ధర రూ.60–80 ఉండగా ప్రస్తుతం రూ.120కి చేరింది. ప్రస్తుతం మిర్చిసాగు ఈ ప్రాంతంలో తగ్గిపోవటంతో కర్ణాటకలోని బెలగాం, కర్నూల్ నుంచి దిగుబడి చేసుకోవాల్సి వస్తోంది. దీంతో రవాణా ఖర్చులతో కలిపి ధరలు దడ పుట్టిస్తున్నాయి.

రూ.150కి చేరుకున్న బీన్స్

బీన్స్ కిలో రూ.150కి చేరుకోవడం వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. పేద, మధ్య తరగతి వారు కొనలేని పరిస్థితి నెలకొంది. ఈ సీజన్‌లో అత్యధికంగా కొండెక్కిన కూరగాయ ఏదైనా ఉందంటే అది బీన్స్ కావడం గమనార్హం. దిగుబడి పూర్తిగా తగ్గిపోవటంతో మార్కెట్‌లో ఒకరిద్దరు మాత్రమే వీటిని విక్రయిస్తున్నారు. బీన్స్, చిక్కుడు ధర సైతం సామాన్యులకు చుక్కలు చూపిస్తోంది. కిలో సుమారు రూ.120కి చేరుకోవడంతో సామాన్యులకు భారంగా మారింది.

టమాటా పైపైకి..

ఇక ధరలు పెరిగే కూరగాయల్లో టమాటా కూడా చేరింది. పదిరోజుల క్రితం వరకు కిలో రూ.30 ఉండగా రూ.50కి చేరుకుంది. మున్ముందు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఎండలు పెరిగిపోవడం, అకాల వర్షాలతో దిగుబడి తగ్గి రాయలసీమ నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటు పెరిగిన కూరగాయల ధరలతో పాటు ఇటు నిత్యావసర సరుకుల రేట్లు కూడా అంతకంతకూ పెరుగుతుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో)

బీన్స్	150
పచ్చిమిర్చి	120
చిక్కుడు	120
టమాటా	40
బీర	70–80
క్యారెట్	60–70
కాకర	80
క్యాప్సికం	80
క్యాబేజీ	40
వంకాయ	40
ఆలు	40

క్లుప్తంగా

వ్యక్తి బలవన్మరణం

పూడూరు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన పిరంగి మహేశ్‌ (24) కుటుంబ సభ్యులతో గొడవపడి శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని మృతిచెందాడని తెలిపారు. మృతుడికి భార్య, ఆరు నెలల కుమారుడున్నాడు. మృతుడి తండ్రి కాశయ్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగిఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్‌

దంపతుల దుర్మరణం

కొడంగల్‌: ఆగిఉన్న టిప్పర్‌ను బైక్‌ ఢీకొట్టడంతో దంపతులు దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటన చిట్లపల్లి గేటు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బషీరాబాద్‌ మండలం దామర్‌చెడ్‌ గ్రామానికి చెందిన కమ్మరి శివాజీ(40), అనిత(35) దంపతులు బైక్‌పై కొడంగల్‌వైపు ప్రయాణిస్తున్నారు. చిట్లపల్లి గేటు సమీపంలో రోడ్డుపై ఓ టిప్పర్‌ ఆగి ఉంది. వాహనాల వెలుతురులో టిప్పర్‌ కనిపించక పోవడంతో వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ భరత్‌రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కుల్కచర్ల: బైక్‌ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్‌ఐ సత్యశీలారెడ్డి తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్‌ జిల్లా లింగాల మండల కేంద్రానికి చెందిన బషీర్‌(56) వికారాబాద్‌ జిల్లా కేంద్రంలో మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మే 21న ఆయన లింగాల నుంచి వికారాబాద్‌ వెళ్తున్న క్రమంలో కామునిపల్లి శివారులో బైక్‌ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌ తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న బషీర్‌ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి నిరంజన్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమతాస్ఫూర్తి కేంద్రం సందర్శన



చినజీయర్‌స్వామితో సంగీత దర్శకుడు ఇళయరాజా

శంషాబాద్‌ రూరల్‌: ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా సమతాస్ఫూర్తి కేంద్రాన్ని శనివారం సందర్శించారు. మండలంలోని ముచ్చింతల్‌ శివారులోని సమతాస్ఫూర్తి కేంద్రం ఆవరణలో నిర్వహించే 'సమతా ఇళయ రాగం' సంగీత కార్యక్రమానికి విచ్చేసిన ఆయన చినజీయర్‌స్వామిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. సమతాస్ఫూర్తి కేంద్రం విశిష్టతను చినజీయర్‌ స్వామి స్వయంగా వివరించారు.

తోటల పెంపకానికి ప్రోత్సాహం

నర్సరీల్లో పండ్ల మొక్కలు సిద్ధం
- 1.10లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు



అనంతసాగర్‌ నర్సరీలోని మొక్కలు



మొక్కలు నాటేందుకు గుంతలు తవ్విస్తున్న అధికారులు

కుల్కచర్ల: గ్రామాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించి పరిసరాలు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ప్రతీ సంవత్సరం హరితహారంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా ప్రారంభోత్సవాలు చేసేవారు. ఈ ఏడాది సైతం మొక్కలు నాటేందుకు అధికార యంత్రంగా అంతర్గతంగా కార్యాచరణ సిద్ధం చేస్తోంది. మండల పరిధిలో 44 పంచాయతీలున్నాయి. ఆయా గ్రామాల పరిధిలో మొక్కలు నాటేందుకు ఇప్పటికే నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉంచారు. మండల వ్యాప్తంగా 1.10లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు గుంతలు తవ్వించారు. గ్రామాలు, అనుసంధాన రోడ్లలో వీటిని నాటేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

60 ఎకరాల్లో పండ్ల తోటలు

ఈ ఏడాది మొక్కలు నాటడంలో పండ్లతోటల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మండలానికి 60ఎకరాలలో పండ్ల తోటలను ఏర్పాటు చేయాలని టార్గెట్‌గా ఇవ్వగా ఇప్పటికే అధికారులు 50 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఆసక్తి ఉన్న రైతుల నుంచి గ్రామాలలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఎంతమంది రైతులు వచ్చినా వారికి పండ్ల పెంపకానికి ప్రోత్సహకాన్ని అందిస్తామని అధికారులు వివరిస్తున్నారు.

“ కార్యాచరణ సిద్ధం



మండల పరిధిలోని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలానుసారం టార్గెట్‌ను అధిగమించేందుకు క్షేత్రస్థాయిలో అధికార సిబ్బంది సాయంతో ఏర్పాట్లు చేస్తున్నాం. పండ్ల తోటలను ఏర్పాటు చేసుకునే రైతులను ప్రోత్సహిస్తున్నాం. పండ్ల మొక్కలు పెంచుకునేందుకు ఆసక్తి ఉన్న రైతులు సంప్రదించవచ్చు.

– చంద్రశేఖర్‌, ఏపీఓ, కుల్కచర్ల

శరవేగంగా నియోజకవర్గ అభివృద్ధి

- రోడ్ల విస్తరణ పనులకు రూ.104 కోట్లు నిధులు మంజూరు
- కాంగ్రెస్‌ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



హస్నాబాద్‌లో డబుల్‌ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్‌/దుద్యాల్‌: నియోజకవర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని కాంగ్రెస్‌ కొడంగల్‌ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలో రూ.104 కోట్ల నిధులతో నిర్మించ తలపెట్టిన డబుల్‌ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పట్టించుకోక పోవడం, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతమవ్వడంతో నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. రోడ్లు అధ్వానంగా తయారవ్వడంతో ప్రజలు ప్రయాణంలో ఎన్నో ఇబ్బందులుపడ్డారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నియోజకవర్గం రూపురేఖలు మారే అవకాశం వచ్చిందన్నారు.

రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

దుద్యాల్‌ మండలం హస్నాబాద్‌ నుంచి దౌల్తాబాద్‌ మండలం నీటూర్‌ గేట్‌ వరకు డబుల్‌ రోడ్డు పనుల రోడ్డు విస్తరణకు రూ.26 కోట్లు, దుద్యాల్‌ మండలం కుదురుమల్ల గ్రామం నుంచి పోలేపల్లి గ్రామ శివారు వరకు రూ.50 కోట్లు మరియు దుద్యాల్‌ మండల కేంద్రం నుండి బొంరాస్‌పేట మండలం లింగంపల్లి గేట్‌ వరకు రూ.28కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్‌ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్‌, ఆర్‌అండ్‌బీ అధికారులు మరియు హస్నాబాద్‌, కుదురుమల్ల కాంగ్రెస్‌ నాయకులు మల్లేశ్‌, ఫక్కీరప్ప, భీములు, కృష్ణ, అంజిలయ్య, నర్సింలు, దుద్యాల్‌ మండల కాంగ్రెస్‌ నాయకులు శేఖర్‌, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లోని అస్సాం బేకరి వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు

వాన.. జనం హైరానా!

వికారాబాద్‌ శనివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. పలు చోట్ల వరద. మురుగు రోడ్లపై పారింది. పట్టణంలోని రామయ్యగూడ రోడ్డులో అస్సాం బేకరి వద్ద మురుగు నీరు ఒక్కసారిగా రోడ్డుపై ప్రవహించడంతో దుర్వాసనతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రోడ్లపై నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

– అనంతగిరి




వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

అయ్యో భౌబోయ్‌

- జిల్లాలో ఏటా పెరుగుతున్న సంఖ్య
- నియంత్రణ చర్యలు శూన్యం
- భారీగా నమోదవుతున్న కుక్కకాటు కేసులు

విజృంభిస్తున్న వీధి కుక్కలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. దారిన వెళ్లేవారిపై దాడి చేస్తూ కండలు పీకేస్తున్నాయి. కుక్కకాటు కేసుల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో గత ఏడాది జనవరి నుంచి మే వరకు 2,731 కుక్కకాటు కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 2,006 కేసులు నమోదయ్యాయి. జిల్లాలోని మణికొండ, నార్సింగి, తుక్కుగూడ, బండ్లగూడ జాగీర్‌, తుర్కయంజాల్‌, పెద్ద అంబర్‌పేట్‌, శంషాబాద్‌, కొత్తూరు, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, షాద్‌నగర్‌, శంకర్‌పల్లి, మీర్‌పేట్‌, బడంగ్‌పేట్‌, జల్‌పల్లి మున్సిపాలిటీల్లో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగింది. చిన్నారులు, వృద్ధులు, వాహనదారులను వెంటపడి మరీ కరిచేస్తున్నాయి. గొర్రెలు, మేకలు, పశువులపై ముప్పేట దాడికి పాల్పడుతున్నాయి. వాటి ధాటికి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఎప్పటికప్పుడు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు వాటిపై దృష్టి పెట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సిటీలో పట్టి.. శివారులో వదిలి

ఎంసీహెచ్‌ పరిధిలో దాదాపు లక్షన్నర కుక్కలుండగా, జీహెచ్‌ఎంసీగా మారి విస్తీర్ణం పెరగడం.. శివారు ప్రాంతాల్లోకి పొరుగు జిల్లాల నుంచి కుక్కలు వలస రావడంతో ప్రస్తుతం వీటి సంఖ్య 7.58 లక్షలు ఉన్నట్లు అంచనా. యానిమల్‌ బర్త్‌ కంట్రోల్‌ (ఏబీసీ) కుక్కలకు సంతాన నిరోధక చికిత్సలు (స్టెరిలైజేషన్‌) చేసేందుకు ఆటోనగర్‌, అంబర్‌పేట, చుడీబజార్‌, జీడిమెట్ల, పటాన్‌చెరులో కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిలో ఏటా 80 వేల కుక్కలకు టీకాలు వేస్తున్నారు. నెలకు రెండు వేల కుక్కలకు స్టెరిలైజన్‌ చేస్తున్నట్లు చెబుతున్నారు. అయినా వీటి సంఖ్య తగ్గకపోగా.. శివారు మున్సిపాలిటీల్లో మరింత పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కోర్‌సిటీలో పట్టిన కుక్కలను ఔటర్‌ అవతల ఉన్న నిర్మానుష్య ప్రాంతాల్లో వదులుతున్నారు. ఆకలితో చెత్తకుప్పల్లో కుళ్లిపోయిన ఆహారపదార్థాలు తిని పిచ్చిపట్టిన వాటిలా వ్యవహరిస్తున్నాయి. గ్రామాల్లోకి చొరబడి వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులు, ఇళ్ల ముందు నిద్రిస్తున్న వృద్ధులు, రోడ్ల వెంట వచ్చిపోయే వాహనదారులపై దాడి చేస్తున్నాయి. మైదాన ప్రాంతాల్లో మేతకు వెళ్లిన గొర్రెలు, మేకలు, పశువులపై పంజా విసురుతున్నాయి.

అత్యధికం ఔటర్‌ చుట్టూ

గ్రేటర్‌ జిల్లాల్లో సుమారు ఏడు లక్షలకుపైగా వీధి కుక్కలుండగా, వీటిలో మెజార్టీ జిల్లాలోనే ఉన్నాయి. వెటర్నరీ విభాగం ఏటా దాదాపు 80 వేల కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేస్తున్నప్పటికీ వీధుల్లోని కుక్కలు మాత్రం తగ్గడం లేదు. అత్యధికం ఔటర్‌ రింగ్‌ రోడ్డుకు అటు, ఇటుగా విస్తరించిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోనే ఉండటం గమనార్హం.

- సాధ్యమైనంత వరకు వీధి కుక్కలు అధికంగా ఉన్న ప్రాంతంలో తిరగకపోవడమే మంచిది.
- ఒకవేళ కుక్క కరిస్తే వెంటనే ధారగా కారుతున్న నీటితో 10 నుంచి 15 నిమిషాల పాటు శుభ్రం చేయాలి.
- రక్తం కారుతున్నా గాయంపై కట్టు కట్టకూడదు. మట్టి, పసుపు, ఆకుపసరు వంటివి పోయకూడదు.
- ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి, యాంటీ రేబిస్‌ వ్యాక్సిన్‌ వేయించుకోవాలి.
- కరిచిన తర్వాత ఒకటి, ఆ తర్వాత 3, 7, 14, 28 రోజుల్లో విధిగా వ్యాక్సిన్‌ వేసుకోవాలి. లేదంటే రేబిస్‌ సోకుతుంది.
- ఈ వైరస్‌ కాలు నుంచి శరీరంలోకి ప్రవేశించిన తర్వాత రోజుకు అర సెంటిమీటర్‌ చొప్పున పైకి ఎగబాకుతుంది. ఇది నరాలు, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

సూచనలు, లక్షణాలు

- తొలిదశలో జ్వరం, తలనొప్పి, వాంతులు కనిపిస్తాయి. రెండో దశలో పిచ్చిగా ప్రవర్తించడం, మనుషులను గుర్తించలేక పోవడం, నోరులోంచి నురుగు రావడం, గొంతు పట్టేయడం, ఊపిరి ఆడకపోవడం వంటివి కనిపిస్తాయి.
- ఇక మూడో దశలో పూర్తిగా కోమాలోకి వెళ్లి, రెండు మూడు రోజుల్లో మృత్యువాత పడుతుంటారు.
- ఇంట్లో ఉన్న కుక్కలకు ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పని సరిగా వ్యాక్సిన్‌ వేయించాలి.

– డాక్టర్‌ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

తెలంగాణ ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రామన్న



గేదెలు చనిపోయిన రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రామన్న

కుల్కచర్ల: పిడుగుపాటుకు మూగజీవాలు మృత్యువాత పడిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ పి.రామన్న అన్నారు. శనివారం ఆయన చౌడాపూర్‌ మండలం కొత్తపల్లి గ్రామంలో పిడుగుపాటుకు గేదెలు మృతి చెందిన లాలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాడి వ్యాపారం చేసుకుని జీవనం సాగించే లాలుకు చెందిన ఐదు గేదెలు మృతిచెందడం భాధకరమన్నారు. అధికారులు స్పందించి భాధిత కుటుంబానికి అండగా ఉండాలన్నారు. పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని యువకుడి అదృశ్యం



బిర్కట్‌ రాకేశ్‌

తాండూరు టౌన్‌: మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమై పదిరోజులు గడుస్తున్నా నేటికీ ఆచూకీ లభ్యమవ్వలేదు. ఈ ఘటన తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన బిర్కట్‌ అంబదాస్‌కు శాంత్‌మహల్‌ చౌరస్తాలో హోటల్‌ ఉంది. ఆయన కుమారుడు రాకేశ్‌(28) మతిస్థిమితం సరిగాలేదు. సరిగా మాట్లాడలేదు. మే 31న రాకేశ్‌ హోటల్‌కి వచ్చిన నాటి నుంచి కనిపించడం లేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో ఈ నెల 1న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

యువతి అదృశ్యం

కుల్కచర్ల: పిన్ని ఇంటి వద్ద ఉంటున్న ఓ యువతి అదృశ్యమైంది. ఈ ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. చిన్నవార్వాల్‌ గ్రామానికి చెందిన మహాలక్ష్మి(19) కొన్ని రోజుల క్రితం చౌడాపూర్‌లోని పిన్ని ఇంటికి వచ్చింది. ఈ నెల 7న ఆమె మహబూబ్‌నగర్‌లో ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లింది. తిరిగి రాత్రి ఇంటికి వచ్చే సమయానికి మహాలక్ష్మి లేకపోవడంతో యువతి తండ్రికి మల్లేశ్‌కు ఫోన్‌ చేసి అమ్మాయి వచ్చిందా అని అడగ్గా రాలేదన్నాడు. వారికి తెలిసిన అన్ని ప్రాంతాల్లో వెతికినా ఎటువంటి ఆచూకీ లభించలేదు. కాగా వారు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

సాక్షి సండే క్లాసిఫైడ్స్‌

REAL ESTATE

RENT

■ Godown for Rent: 5000 to 10000 Sq.ft. Godown at Mallapur Indl., Boduppal. Ph: 9566030606 [QA-259]

WANTED

■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం : 18K. Ph : 9160900024, 9640400073 [H-799887]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌/ డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మమతా & నిమ్మి స్కూల్‌ ఆఫ్‌ నర్సింగ్‌

(Recognised by Govt. of T.S. & TSNMC & INC New Delhi)

అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

విద్యార్హతలు : స్త్రీ / 10+2 పాస్‌ లేదా తత్సమానమైన పరీక్ష ఉత్తీర్ణులైనవారు. వయస్సు 17-35 సం॥ల వరకు ఉండవలెను.

ఆసక్తి కలవారు క్రింది అడ్రసులో సంప్రదించగలరు.

అడ్మిషన్లు తీసుకొనబడుచున్నవి

Wanted Teachers (B.Sc Nursing)

Office Staff (B.Com with Computers)

T.S. బాబూరావు కరెస్పాండెంట్‌

ప్లాట్‌ నం.47, 264, 265, హిల్‌ కాలనీ, వనస్థలిపురం, హైదరాబాద్‌.

8639683084, 9391010203

కానిస్టేబుల్‌ శ్రీలతకు రివార్డు



రివార్డు అందజేస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం: కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన కల్పించేందుకు వారం రోజులు గా గురునానక్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో ప్రత్యే క శిక్షణ ఇస్తున్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌ స్టేషన్‌ క్రైమ్‌ ఉమెన్‌ కానిస్టేబుల్‌ శ్రీలత ఇచ్చిన ప్రజెంటేషన్‌ పలువురు పోలీస్‌ అధికారులు ప్రశంసించారు. శనివారం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి శ్రీలత ప్రజంటేషన్‌కు రివార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

1,392 కేసులకు పరిష్కారం

ఆమనగల్లు: రాజీపడి కేసులను పరిష్కరించుకుంటే ఇరువర్గాలు గెలిచినట్లేనని ఆమనగల్లు జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ కాటం స్వరూప అన్నారు. శనివారం పట్టణంలోని ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో జాతీయ లోక్‌ అదాలత్‌ నిర్వహించారు. ఈ అదాలత్‌లో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల పోలీసు స్టేషన్‌ పరిధిలోని 1,392 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఏసీపీ కార్తీక్‌, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్‌, కడ్తాల సీఐ శివప్రసాద్‌, మాడ్గుల సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆమనగల్లు ఎక్సైజ్‌ సీఐ బద్యానాద్‌ చౌహాన్‌, ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాంనాయక్‌, న్యాయవాదులు ఆంజనేయులుయాదవ్‌, జగన్‌ ఉన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్‌

మహేశ్వరం: పేకాట ఆడుతున్న ఆరుగురు యువకులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఎస్‌ ఐ మధు తెలిపిన ప్రకారం.. మామిడిపల్లి రంగనాయకుల కాలనీకి చెందిన దాసరి శ్రీశైలం, పల్లపు సురేశ్‌, ఒరుసు అజయ్‌కుమార్‌, కేతావత్‌ రాజు, ముడావత్‌ నరేశ్‌, రమేశ్‌ శుక్రవారం రాత్రి పేకాడుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి వారిని అరెస్ట్‌ చేశారు. వారి వద్ద రూ.8,100 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు సెట్ల కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కోర్టు భవన నిర్మాణానికి కృషి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బార్‌ అసోసియేషన్‌ సభ్యులు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: పట్టణంలో కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన స్థలం సేకరించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఆమనగల్లు బార్‌ అసోసియేషన్‌ సభ్యులు కసిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కోర్టు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం పట్టణంలో కొనసాగుతున్న కోర్టు భవనం శిథిలావస్థలో ఉందని.. నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. భవన నిర్మాణానికి అనువైన స్థలం చూసి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆమనగల్లు మున్సిపల్‌ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆమనగల్లు బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్‌, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు యాదవ్‌, సీనియర్‌ న్యాయవాది లక్ష్మణశర్మ, యాదీలాల్‌, న్యాయవాదులు సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, శేఖర్‌, కృష్ణ, మధు, సంతోశ్‌,గణేశ్‌, మల్లేశ్‌, దేవేందర్‌ తదితరులు ఉన్నారు.

కేవీపీని కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి

మాజీ రాజ్యసభ సభ్యుడు, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకుడు కేవీపీ రామచంద్రారావును శనివారం ఆమనగల్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని కేవీపీ నివాసంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు సురభి వెంకటేశ్వరరావు, సురేందర్‌రెడ్డి తదిరతులున్నారు.